క్లుప్తంగా

శాప్ డైరెక్టర్‌గా రవీంద్రనాథ్ బాధ్యతల స్వీకరణ



శాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పేరం రవీంద్రనాథ్

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్‌గా దేవరపల్లి మండలం రామన్నపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లు ఆయన డైరెక్టర్‌గా కొనసాగుతారు. గతంలో శాప్ డైరెక్టర్‌గా, రాష్ట్ర క్రీడాభివృద్ధి కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. సుమారు 35 ఏళ్లు పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ జెడ్పీ పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేశారు.

బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారం



బాలుడికి పటికబెల్లంతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: స్థానికంగా వేంచేసిన బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఇద్దరు చిన్నారులను కుటుంబ సభ్యులు పటికబెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన పంచాయతీ ఉప సర్పంచ్ వెలగా సాంబశివరావు, వీరవెంకట నాగలక్ష్మి దంపతుల కుమారుడు హేమంత్, మౌనిక మంగతాయారు దంపతులు ఇద్దరు కుమారులు జై శివ శ్రీషణ్ముఖ, నాగదుర్గా దేవాన్ష్‌ను పటికబెల్లంతో తులాభారం వేశారు. ఇప్పటి వరకు ఆలయంలో 493 తులాభారాలు జరిగినట్టు ఆలయ కమిటీ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరాటేలో పతకాల పంట

ప్రకాశం నగర్: పిల్లలు చదువుతో పాటు క్రీడలు, ఆటలు, ఇతర పోటీలపై దృష్టి సారించాలి. తరగతి గదిలో పాఠాలను చదువుకోవడమే కాకుండా కరాటే తదితర వాటిపై ఆసక్తి పెంచుకోవాలి. వీటి వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఆత్మరక్షణకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనల నేపథ్యంలో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటేలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు చదువుతో పాటు కరాటేపై ఆసక్తి చూపుతున్నారు. ఆ విభాగంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొని బహుమతులు సాధిస్తున్నారు.

కరాటే శిక్షణ

రాజమహేంద్రవరం నగరంతో పాటు ధవళేశ్వరానికి చెందిన పలువురు విద్యార్థులు మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్ వద్ద కరాటే శిక్షణ తీసుకుంటున్నారు. వీరిలో ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా కొందరు నేర్చుకుంటున్నారు. కరాటేలో సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెళకువలపై శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే వంటి శిక్షణలు వారిలోని ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు ఆపదలో ఆదుకునేలా ఉంటాయని శిక్షకులు చెబుతున్నారు. ఐతే మిగిలిన క్రీడలతో పోలిస్తే కఠోర శిక్షణ, ఏకగ్రత, క్రమశిక్షణతో కూడుకున్న ఈ విద్యల్లో రాణించడం అంత సులభం కాదని చెబుతున్నారు.

విజేతలు వీరే..

విక్టరీ షోటో ఖాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల్లే తెనాలిలోని ఎన్‌టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కటాస్, కుమిటే విభాగంలో కె.జాక్ క్వాస్, జి.ధనశ్రీ, జి.యశస్వి, ఎన్.శ్రీలక్ష్మి లత, కె.లావణ్య రమ్య, టి.శ్రీగణేష్, వికాస్ నారాయణ, హర్షవర్ధన్ సాయి, అభి, కె.భవిష్య, కె.లాస్య, సహస్ర, పి.పూజ, జీవీ నారాయణ, పి.శ్రీరామ్, ఎన్.శరత్ శ్రీవంశీ, నాన్సీ, షేక్ అహ్మద్ నూర్, ఈశ్వర్, వి.భువన నాగేశ్వరీ, ఎన్.నిఖిలేష్, మోక్షన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పలు పతకాలు కైవసం చేసుకున్నారు. వీరితో పాటు గ్రాండ్ చాంపియన్ షిప్ బ్లాక్ బెల్ట్ బాలుర విభాగంలో చరణ్ చాంపియన్ ట్రోఫీ సాధించాడు. బాలికల విభాగంలో కె.లక్ష్మీభవానీ గ్రాండ్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. విజేతలను సౌత్ జోన్ డీఎస్పీ ఎస్.భవ్య కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

నిత్యావసరాల వితరణ

కడియం: మండలంలో అంగవైకల్యం, వృద్ధాప్యంలో ఉన్న ఐదు కుటుంబాలకు శుక్రవారం దామిరెడ్డిపల్లిలో నిత్యావసరాలు, బియ్యం, కిరాణా తదితర సామగ్రిని శుక్రవారం అందజేశారు. డి.అనిరుథ్ కుమార్, వై.చార్లెస్ పాల్, డాక్టర్ రత్నరాజు, ఎన్‌టీపీసీ విశ్రాంత డీజీఎం ఫ్రాన్సిస్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డేనియల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- నిరుపయోగంగా సంపద కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీలు
- మండల అధికారుల పర్యవేక్షణ కరవు



అన్నవరప్పాడులో రోడ్డుపైనే చెత్తాచెదారం

పెరవలి: పల్లెలు, పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించి స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా తడి చెత్త, పొడి చెత్తలను సేకరించే విధానాన్ని అమలు చేస్తున్నారు. సేకరించిన ఈ చెత్త నుంచి వర్మి కంపోస్టు (సేంద్రియ) ఎరువులు తయారు చేసి రైతులకు, ప్రజలకు విక్రయించి ఆదాయం స్థానిక సంస్థలకు ఆదాయం సమకూర్చి వాటితో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. అవసరమైన సిబ్బంది, కార్మికులను నియమించి, లక్షల నిధులు కేటాయించి అనేక చోట్ల చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం, కార్యాచరణలో లోపం కారణంగా సంపద సృష్టి కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారి ఆశించిన ఫలితాలు రావడం లేదు.

సంపద కేంద్రాలకు, ట్రై సైకిళ్లు, ఆటోలకు రూ.1.68 కోట్లు ఖర్చు

పెరవలి మండలంలో 18 గ్రామాల్లో 18 సంపద కేంద్రాలకు షెడ్లు నిర్మించారు. వీటికి గ్రామస్థాయిని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించారు. మొత్తం 18 షెడ్లకు రూ.1.17 కోట్లు ఖర్చు చేసారు. అంతే కాకుండా ట్రై సైకిళ్లు ఒక్కొక్కటి రూ.31,400 చొప్పున 69 ట్రై సైకిళ్లు చెత్త సేకరణకు సమకూర్చారు. వీటి విలువ రూ.22.66 లక్షలు, 24 ఆటోలకు రూ.24 లక్షలు, డస్ట్‌బిన్లు 588 పంపిణీ చేయగా వీటి విలువ రూ.3.58 లక్షలు పారిశుధ్య నిర్వహణ కోసం ఇప్పటి వరకు గత మూడేళ్లలో రూ.1.68 కోట్లు ఖర్చు చేశారు. ఇంత చేసినా ఇప్పటి వరకు కొన్ని గ్రామాల్లో వీటిని వినియోగంలోకి తీసుకురాలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పెరవలి మండలంలో 18 గ్రామాల నుంచి ఈ సంపద కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు కేవలం రూ.24 వేల ఆదాయం మాత్రమే సంపాదించినట్టు రికార్డుల్లో నమోదైంది. అధికారుల నిర్లక్ష్యం వలన ఈ పథకం లక్ష్యం నీరు గారిపోయింది.



ఖండవల్లిలో నిరుపయోగంగా సంపద కేంద్రం



కాకరపర్రులో ఖాళీగా ఉన్న సంపద కేంద్రం

పంచాయతీలకు పెరిగిన సిబ్బంది

గత ప్రభుత్వాల కన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో శాఖకు ఒక అధికారిని నియమించడంతో ఉద్యోగుల సంఖ్య గ్రామస్థాయిలో బాగా పెరగడంతో పాటు పంచాయతీలకు వివిధ శాఖల పనుల ప్రమేయం తగ్గింది. పారిశుధ్యంపై దృష్టి పెట్టవలసిన కార్యదర్శులు వీటిని నిర్లక్ష్యం చేయడంతో ఇవి ఆర్థిక పరిపుష్టి సాధించలేకపోతున్నాయి.

గ్రామాల్లో తాండవిస్తున్న అపరిశుభ్రత

రోజుల తరబడి గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ వదలివేయడంతో వర్షాలకు తడిసిన చెత్త నుంచి దుర్గంధం వ్యాపిస్తోంది. పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో రోడ్లపై చెత్తా చెదారం చేరి ప్రయాణికులు, బాటసారులు, గృహవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త నుంచి దుర్గంధం వెదజల్లటం వలన ప్రజలు రోగాల బారినపడి తీవ్ర అస్వస్థకు గురై ఆసుపత్రుల పాలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్లు, కాలువ గట్ల వద్ద చెత్త డంపింగ్



గ్రామాల్లో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చినప్పుడు మాత్రమే గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. ఇళ్ల వద్ద చెత్తను సేకరించడం లేదు. ఒకవేళ సేకరించినా రోడ్లు లేక కాలువ గట్లు పక్కన డంప్ చేస్తున్నారు. సంపద కేంద్రాలు ఉన్నా అక్కడికి చెత్త తరలించడం లేదు.

– కుసుమే సూరిబాబు, ఖండవల్లి

ప్రజలకు ఇబ్బందులు



ఏ గ్రామం వెళ్లినా మొదటగా రోడ్డు పక్కన చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్తా చెదారం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. చెత్త నుంచి రోడ్లు పైకి చేరడంతో దుర్గంధం వ్యాపిస్తోంది.

– గిద్దా ఏడుకొండలు, అన్నవరప్పాడు

సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి



సంపద కేంద్రాల వద్ద సేంద్రియ ఎరువులు తయారు చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వర్షాల వలన ఎరువు తయారు చేయటానికి షెడ్లు వద్దకు చెత్తను తీసుకువెళ్లడానికి ఇబ్బందులు ఉన్నాయి. వర్షాలు తగ్గిన తరువాత అన్ని గ్రామాల్లో చెత్తను సేకరించి, వర్మి కంపోస్టు ఎరువు తయారీపై దృష్టి సారిస్తాం.

– సీహెచ్ వెంకటరమణ ఈఓపీఆర్డీ అండ్ ఇన్‌చార్జి ఎంపీడీఓ, పెరవలి

పారిశుధ్యం మెరుగుపరచాలి

- మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల డిమాండ్
- మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యతన కౌన్సిల్ సాధారణ సమావేశం



మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు



కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి(కొవ్వూరు) : పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, డ్రెయిన్లలో సిల్ట్ తొలగించడం లేదని, విద్యుత్ సిబ్బంది చెట్లు నరికే సమయంలో మున్సిపాలిటీకి నష్టం వస్తోందని తదితర సమస్యలను కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సమావేశాన్ని కొనసాగించారు. ఈసందర్భంగా కౌన్సిలర్లు పలు సమస్యలను సమావేశంలో చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా 12వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కంటమణి రమేష్‌బాబు మాట్లాడుతూ కొవ్వూరు పట్టణంలో నెలరోజులుగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, ఇళ్ల వద్ద నుంచి మూడు రోజులకు ఒకసారి చెత్త సేకరిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ శాఖ చెట్లను నరుకుతున్న సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో, తీగలు, విద్యుత్ దీపాలు మరమ్మతులకు గురై మున్సిపాలిటీపై ఆర్థిక భారం పడుతోందని, చెట్లను నరికే సమయంలో జాగ్రత్తలు తీసుకునేలా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించాలని కోరారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ పుష్కరాలకు సంబంధించి రాజమహేంద్రవరం హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధి పనులు చేపట్టనున్నారని, కొవ్వూరు గోష్పాద క్షేత్రం వరకూ అవి కొనసాగేలా సంబంధిత మంత్రులు, ఎంపీపై ఒత్తిడి తీసుకువచ్చి పుష్కర నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కొవ్వూరులో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పారిశుధ్యం లోపిస్తే ప్రజలు అనారోగ్యాల బారిన పడతారని అన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని సన్నద్ధం కావాలని తెలిపారు. పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టే ముందు మున్సిపాలిటీకి తెలియజేయాలని కోరుతూ విద్యుత్ శాఖకు లేఖ రాయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ చెత్త సేకరణకు ఉపయోగించే కాంపాక్టర్లు మరమ్మతులకు గురవడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, ప్రస్తుతం ఒక కాంపాక్టర్ మరమ్మతులు పూర్తయ్యాయని తెలిపారు. 40 కాంపాక్టర్ బిన్లు కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ పారిశుధ్యలోపం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేచించారు.

ముగింపు నిల్వ రూ.18.49 కోట్లు

మే నెల ఆదాయ వ్యయాలను తెలుపుతూ ప్రారంభ నిల్వ రూ. 18,95,93,467, రూ.46,87489 వ్యయం కాగా, పురపాలక శాఖ ముగింపు నిల్వ రూ.18,49,16278 ఉందని కౌన్సిల్ ముందు ఉంచారు. కౌన్సిల్‌లో రూ.46,74,224 సంబంధించి వివిధ చెల్లింపులు, పనులకు సంబంధించి కౌన్సిల్‌లో ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంధ్రోతు అంజలీదేవి, మన్నే పద్మ, కౌన్సిలర్లు కోడూరి శివరామకృష్ణ, రుత్తల భాస్కర్‌రావు, అక్షయపాత్ర శ్రీనివాస్ రవీంద్ర, అంకోలు లిల్లీ పద్మావతి, తోట ప్రసన్న, బత్తి నాగరాజు, కండెల్లి రామారావు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెరవలి: బాలిక అదృశ్యంపై ఆమె కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పెరవలి ఎస్సై యం వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాపవరానికి చెందిన రెల్లి శ్రీనివాస్, త్రివేణి దంపతుల కుమార్తె సునీత (21) ఇంటర్మీడియట్ చదివి ఇంటి వద్ద ఉంటోంది. ఈనెల 26న తల్లి త్రివేణి, కుమారుడు కలిసి మధ్యాహ్నం పెరవలిలో బ్యాంకుకి వెళ్లి, తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి కుమార్తె ఇంటిలో కనిపించకపోవడంతో చుట్టపక్కల అంతా వెతికి బంధువులకు ఫోన్ చేసి ఆచూకీ కోసం గాలించారు. గురువారం సాయంత్రం పోలీసులకు తల్లి త్రివేణి ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఎవరికైనా బాలిక ఆచూకీ తెలిస్తే 94407 96642 నంబరుకు ఫోన్ చేసి తెలపాలని ఆయన కోరారు.

వారాహి మాత ఆలయంలో పూజలు

తాళ్లపూడి(కొవ్వూరు): ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం సమీపంలోని వారాహి మాత అమ్మవారి ఆలయంలో నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలి

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు మొదట విద్యుత్ సర్వీస్ తీసుకున్నప్పుడు అప్పటికున్న లోడు ప్రకారం సర్వీస్ తీసుకున్నారని, కాలక్రమేణ ప్రతి గృహంలో ఏసీలు, వాషింగ్ మిషన్లు, కూలర్లు, గ్రైండర్లు, వాటర్ హీటర్లు, గీజర్లు ఏర్పాటు చేసుకున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ దేవరపల్లి సెక్షన్ ఏఈ సీహెచ్ వెంకట్రావు తెలిపారు. దీనివల్ల కనెక్టడ్ లోడు పెరిగిన కారణంగా కాంట్రాక్టర్ లోడు పెంచుకోవలసి ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం 50 శాతం రాయితీతో విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం కిలోవాట్‌కు రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఈ నెల 30 వరకు గడువు ఉందని ఆయన చెప్పారు. అదనపు లోడు ఉన్న వినియోగదారులు ఈ నెల 30వ తేదీలోగా వీడీఎస్ పథకంలో వినియోగదారులు అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరించుకోవాలని ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్డీఎస్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కరపత్రాల పంపిణీ

నిడదవోలు : బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ పట్టణంలో శుక్రవారం బీజేపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణంలో పలు సెంటర్లలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పరిమి



పరిమి సోమరాజు

చాగల్లు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగంలో కొవ్వూరు మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడికి స్థానం లభించింది. పశివేదల గ్రామానికి చెందిన పరిమి సోమరాజు రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. పరిమిసోమరాజు గతంలో సొసైటీ అధ్యక్షుడిగా, పార్టీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శితో పాటు పార్టీలో పలు కీలక పదవుల్లో పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ఆయన కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రైతుల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి పదవిలో స్థానం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ఉండ్రాజవరం: పీఎం ఫసల్ బీమా యోజనలో భాగంగా ఈ ఖరీఫ్‌లో రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు శుక్రవారం తెలిపారు. ఈ సీజన్‌లో తూర్పుగోదావరి జిల్లాలో వరి (గ్రామ యూనిట్), మినుము (మండలం యూనిట్), అరటి (వాతావరణ ఆధారిత) పంటలకు పంటల బీమా పథకంలో గుర్తించామన్నారు. వరి, మినుము పంటలకు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, అరటికి ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియం చెల్లించాలన్నారు. వరికి ఎకరాకు రూ.576.92, మినుము రూ.303.64, అరటికి రూ.3,036, వరికి ఆగస్ట్ 15, మినుము జూలై 31, అరటికి జూలై 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించనున్నట్టు తెలిపారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహ రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలకు ఏవో ఆఫీస్‌లో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు భారత ప్రభుత్వం కృషి రక్షక్ పోర్టల్/హెల్ప్ నంబర్ 14447 రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయ, ఉద్యానవన అధికారి కార్యాలయం, వ్యవసాయ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 155251ను సంప్రదించాలన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం



అన్నదేవరపేట ప్రభుత్వ లే అవుట్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని జగనన్న ప్రభుత్వ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలను ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఐదు గ్రామాలకు చెందిన 945 మంది లబ్ధిదారులకు ఈ లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. 200 మంది గృహాలను నిర్మించుకున్నారు. 161 గృహాలు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. మిగిలినవి నిర్మాణాలు ప్రారంభించలేదని తెలిపారు. ఇప్పటికే రూ. 50 వేలు చొప్పున లబ్ధిదారులకు రుణం అందజేశామని తెలిపారు. కాలనీలో తాగునీరు లేదని, మురికి నీరు బయటకు వెళ్లడానికి ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆయన వెంట గృహనిర్మాణ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

బొజ్జా తారకం సేవలు స్ఫూర్తిదాయకం



తారకం చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

కడియం: వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచే పోరాట యోధుడు బొజ్జా తారకం అని, ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. పొట్టిలంకలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో తారకం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో న్యాయవాది బడుగు సత్తిబాబు, ట్రేడ్ యూనియన్ నాయకులు కోణాల లాజర్, రిపబ్లికన్ పార్టీ నాయకులు నక్కా వెంకట రత్నరాజు, గొల్లపల్లి మనోహర్, నక్కా చంటిబాబు పాల్గొన్నారు.